మట్టి కొట్టుకుపోతున్నారు

- రాత్రి సమయాల్లో తరలింపు
- పట్టించుకోని అధికారులు


పూడేరు ప్రాంతంలోని అటవీ భూముల్లో సాగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలు


పూడేరులో అక్రమ తరలింపులతో పెద్ద గుంతలు

నాయుడుపేటటౌన్: మండలంలో మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములు, చెరువులు, పోరంబోకు స్థలాలన్నీ పెద్ద పెద్ద బావుల్లా మార్చేస్తున్నారు. పూడేరు, అరవపెరిమిడి, పుదూరు తదితర ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో అటవీ భూముల్లో ఇష్టారాజ్యంగా మట్టి అక్రమ తరలింపులు రోజురోజుకూ జోరందుకుంటున్నాయి. మమ్మల్ని అడిగే వారెవరు అంటూ జేసీబీ, హిటాచీలాంటి పెద్ద పెద్ద మిషన్లు పెట్టి టిప్పర్లలో రాత్రి సమయాల్లో తరలించుకుపోతున్నారు. కొద్ది రోజులుగా మండల పరిధిలోని పూడేరులోని ఆటవీ, ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల్లో పెద్ద సంఖ్యలో టిప్పర్లతో గ్రావెల్ తరలించేస్తున్నారు. రాత్రిళ్లు పెద్ద సంఖ్యలో టిప్పర్లలో గ్రావెల్ అక్రమంగా తరలిపోతున్నా అధికారులు, పోలీసులు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.


గోతులతో నిండిన ప్రభుత్వ, అటవీ భూములు

> **అడ్డుకట్ట వేస్తాం**
> మండల పరిధిలోని పూడేరు పంచాయతీలో అక్రమంగా గ్రావెల్ తరలించేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. దాంతో గ్రావెల్ తరలింపులకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల్లో గ్రావెల్ అక్రమంగా తరలిస్తుండడంతో భూమి పట్టాలు సైతం రద్దు చేశాం. గ్రావెల్ తరలింపులపై కొంతమంది పూడేరు ఆయకట్టు రైతులు, గ్రామస్తులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.
> – మాగర్ల రాజేంద్ర తహసీల్దారు, నాయుడుపేట

క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలో ఖాళీగా అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్లు, హెల్పర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి మంగళవారం కోరారు. మండలంలో ఖాళీగా ఉన్న అయ్యప్పరెడ్డి పాళెం మినీ అంగన్‌వాడీ కేంద్రానికి వర్కర్ (జనరల్ కేటగిరి)పోస్టుకు, దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలో ఖాళీగా ఉన్న హెల్పర్ల పోస్టులకు నాయుడుపేట పట్టణంలోని జైహింద్ కాలనీ(జనరల్), ఎల్‌ఏ సాగరం (ఎస్టీ), మండలంలోని స్నేహపురి కాలనీ (జనరల్), రామారెడ్డి కండ్రిగ(ఎస్సీ), చిగురుపాడు హెచ్‌డబ్ల్యూ(ఎస్సీ), కుప్పరగుంట(ఎస్టీ) అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి హెల్పర్ల పోస్టులకు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో కానీ, నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయంలో కానీ సంప్రదించవచ్చని తెలిపారు.

బోసిపోయిన పీహెచ్‌సీలు


చిల్లకూరు పీహెచ్‌సీలో వైద్యులు లేకపోవడంతో మూసి ఉన్న గది

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల తాము నష్ట పోతున్నామని పీహెచ్‌సీల్లో పని చేసే వైద్యులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు పిలుపునివ్వడంతో పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందవని తెలుసుకున్న రోగులు అక్కడికి రాకపోవడంతో మంగళవారం ఆస్పత్రులన్నీ బోసిపోయి కనిపించాయి. మండలంలో చిల్లకూరు, వల్లిపేడు, చింతవరం, వరగలి గ్రామాల్లో పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో ప్రతి రోజు కనీసం సుమారు 100 నుంచి 150 మంది వరకు ఓపీ సేవలు అందుకుంటున్నారు. అయితే వైద్యులు సమ్మెలోకి దిగారని తెలుసుకున్న ప్రజలు ఆస్పత్రుల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి


సునీల్(ఫైల్)

పెళ్లకూరు: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం రాత్రి వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు చెంబడిపాళెం గ్రామానికి చెందిన సూళ్లూరు సునీల్(29) వివాహేతర సంబంధం పెట్టుకున్న అమ్మాయికి వేరొకరితో పెళ్లవడంతో మనస్థాపం చెందిన సునీల్ పురుగుల మందు తాగాడు. అతడిని చెన్నై విజయా స్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్యతోపాటు కుమారులు అశ్వంత్, పార్ధు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

– ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేటటౌన్ : పట్టణ పరిధిలోని తుమ్మూరు (పాత చెక్ పోస్టు) రహదారిపై మంగళవారం రాత్రి మోటార్ బైక్‌ను ఆటో ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు, మండల పరిధిలోని అయ్యప్పరెడ్డి పాళెం గ్రామానికి చెందిన కుంపటి సురేష్ బైక్‌పై నాయుడుపేటకు వచ్చి తిరిగి మంగళవారం రాత్రి గ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో ఆటో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని ప్రమాదానికి కారణమైన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు 1-10-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	125
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	228
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	250
లేయర్ చికెన్	:	187

పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డికి స్వాగతం


మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి మిథున్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందిస్తున్న సుబ్రహ్మణ్యం రెడ్డి

నాయుడుపేటటౌన్: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని రేణిగుంట విమానాశ్రయం వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. తంబిరెడ్డి మాట్లాడుతూ కూటమి కుట్రలు, కుతంత్రాలను పంటాపంచలు చేసుకుని కడిగిన ముత్యంలా ఎంపీ మిథున్ రెడ్డి బయటకు వచ్చారని చెప్పారు.

సాయం చేయడంలోనే సంతృప్తి


పేద మహిళలకు తోపుడు బండిని అందిస్తున్న ట్రస్టు అధినేత శ్రీనివాసులు

చిల్లకూరు : పేదలకు తన వంతు సాయం చేయడంలోనే ఎంతో తృప్తి ఉందని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని చేడిమాల గ్రామం ట్రస్టు కార్యాలయంలో మంగళవారం గూడూరుకు చెందిన ఓ పేద మహిళకు చిరు వ్యాపారం చేసుకునేందుకు అవసరమైన తోపుడు బండిని అందించారు. అనంతరం శ్రీనివాసుల పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కో–ఫౌండర్ శిరీషా, చైర్మన్ పిచ్చయ్య నాయుడు, కార్యదర్శి రామానాయుడు, నెల్లూరు అర్బన్ విద్యాశాఖాధికారి హమీద్, ఉపాధ్యాయులు ప్రజేంద్ర రెడ్డి, ట్రస్టు ప్రతినిధులు బాబు, శ్రీదేవి, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

పోలేరమ్మకు పట్టువస్త్రాల సమర్పణ

నాయుడుపేటటౌన్ : స్థానిక గ్రామ దేవత పోలేరమ్మకు మంగళవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, పార్దు దంపతులు కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పట్టణంలోని పిల్లారిగుడి వద్ద ప్రత్యేక పూజలు చేసి, అక్కడి నుంచి పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారి పట్టు వస్త్రాలు సమర్పించారు.

కండలేరులో 57.330 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 57.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3600 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరుకాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటిబ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా



తడ: క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మండల నాయకులు, పెళ్లకూరు: డిజిటల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

ఓజిలి/చిల్లకూరు/పెళ్లకూరు/తడ : కూటమి నేత దాడుల నేపథ్యంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి భరోసా కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారు. ఆ డిజిటల్ బుక్ పోస్టర్లను అన్ని మండలాల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఓజిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి, గూడూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గూడూరు పట్టణ, రూరల్ కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, పెళ్లకూరు మండలం చిల్లకూరులోని పార్టీ కార్యాలయంలో కందుకూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తడ మండల కేంద్రంలోని పున్నమి అతిథి గృహంలో పార్టీ మండల కన్వీనర్ కే ఆర్ముగం ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు.



ఓజిలి: డిజిటల్‌బుక్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, చిల్లకూరు: డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ విడుదల చేస్తున్న మండల నాయకులు

వేలాడుతున్న విద్యుత్ తీగలు


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్‌ను చూపిస్తున్న రైతు

కలువాయి(సైదాపురం): మండలంలోని కనుపూరుపల్లి పంచాయతీ మజారా గ్రామం అయిన వెరుబొట్లపల్లిలో 6 నెలలుగా విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి తీగలు కిందికి వేలాడుతున్నాయి. చేతికి అందే అంత ఎత్తులో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని సరి చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. పొలాన్ని దున్నే సమయంలో కూడా ట్రాక్టర్‌కి తగిలే పరిస్థితి నెలకొనడంతో ఇబ్బందికరంగా ఉందని వివరించారు. ఆరు నెలలుగా సమస్యని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

అన్నప్రసాదం.. సంతృప్తికరం

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సంతృప్తికరంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తున్నట్లు టీటీడీ అన్నప్రసాద విభాగం డిప్యూటీ ఈఓ రాజేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం తిరుమలలోని రామ్ భగీచా–2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో అన్న ప్రసాద విభాగం ప్రత్యేక అధికారి జీఎల్ఎస్ శాస్త్రితో కలిసి ఆయన మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అన్నప్రసాదం, అల్పాహారం, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో టీటీడీ సీపీఆర్‌ఓ డాక్టర్ టి.రవి పాల్గొన్నారు.

దుర్గమ్మా.. నమోస్తుతే!

సూళ్లూరుపేట: దుర్గాదేవిగా శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి



నాయుడుపేట: దుర్గాదేవిగా దుర్గామల్లేశ్వరి దేవి



వెంకటగిరి : దుర్గాదేవిగా కాత్యాయని అమ్మవారు



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అమ్మవారి ఆలయాల్లో కనులపండువగా సాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. దుర్గాష్టమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పునీతులయ్యారు. – సాక్షి నెట్‌వర్క్


చిల్లకూరు : దుర్గాదేవి అలంకరణలో ముత్యాలమ్మ


చిట్టమూరు : దుర్గాదేవి అలంకరణలో కామాక్షమ్మ


రాపూరు: దుర్గాదేవిగా అంకమ్మతల్లి

గుమ్మడి విక్రయాలు వెలవెల


జాతీయ రహదారి పక్కన విక్రయాలకు సిద్ధంగా ఉన్న బూడిద గుమ్మడి కాయలు

చిల్లకూరు: రైతుల నుంచి టన్ను రూ.25 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేసిన గుమ్మడికాయలు అమ్ముడుపోకపోవడంతో వ్యాపారులు దిగాలు చెందుతున్నారు. దసరా పండుగ రోజున ప్రతి ఇంటి ముందు, వ్యాపార సముదాయాల ముందు దిష్టి కోసం బూడిద గుమ్మడిని పగుల కొడతారు. ఈ నేపథ్యంలో ఇక్కడి వ్యాపారులు తమిళనాడు సమీప ప్రాంతాలకు వెళ్లి గుమ్మడి కాయలు కొనుగోలు చేసుకొచ్చారు. అయితే ఇక్కడ విక్రయానికి ఉంచితే ఎవరూ అంతగా ఆసక్తి చూపించకపోవడంతో వ్యాపారాలు వెలవెలబోతున్నాయి.